క్లుప్తంగా

గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో ఉన్నతాధికారుల పర్యటన



గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు, జెడ్సీ కృష్ణ

తాటిచెట్లపాలెం: జాతీయ రహదారిపై తాటిచెట్లపాలెం నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు గల గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో గురువారం జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వై.శ్రీనివాసరావు, జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఉద్యాన శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. మార్చిలో జరగనున్న జీ-20 సదస్సు కోసం నగరాన్ని సుందరీకరణ చేసే దిశగా ఈ ప్రాంతంలో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ దామోదర్, డీసీపీ, సూపరింటెండెంటింగ్ ఇంజినీర్ వేణుగోపాల్, అసిస్టెంట్ ఇంజినీర్ ఉషా రాణి తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ పార్కింగ్ వాహనాల తరలింపు



టోయింగ్ వాహనం ద్వారా కారును తరలింపజేస్తున్న ట్రాఫిక్ సీఐ అప్పారావు

మద్రిపాలెం: రహదారులపై ప్రమాదాల నియంత్రణలో భాగంగా గురువారం కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బీఆర్‌టీఎస్ సర్వీసు రోడ్డుకు ఇరువైపులా ఎప్పటి నుంచో రాంగ్ పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తునటువంటి వాహనాలను టోయింగ్ వాహనం ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు మాట్లాడుతూ కొంతకాలంగా రోడ్డుకు ఇరువైపులా పార్క్‌చేసి వదిలేస్తున్న వాహనాలను తొలగించి కంచరపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. కంచరపాలెం మెట్టు నుంచి 104 ఇండస్ట్రియల్ ఎస్టేట్ వరకు ఈ డ్రైవ్ నిర్వహించామన్నారు. 35 వాహనాలను తరలించి, రూ.9,600 జరిమానా విధించామని ఆయన చెప్పారు.

సింహగిరి వైభవాన్ని చాటిచెప్పాలి



సింహగిరి కరపత్రికను ఆవిష్కరిస్తున్న దాడి సత్యనారాయణ

మల్కాపురం: సింహాద్రినాథుడి వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. మల్కాపురంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సింహగిరి కరపత్రికను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సింహాచలం పుణ్యక్షేత్రానికి గొప్ప చరిత్ర ఉందన్నారు. అది నేటితరానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. భక్తులు, సేవకులు సింహగిరి గొప్పతనాన్ని అందరికీ చాటిచెప్పాలన్నారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

'ఎల్ఐసీని బలోపేతం చేయండి'

దాబాగార్డెన్స్: ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని, ఎల్ఐసీని బలోపేతం చేయాలంటూ జీవిత బీమా రంగ ఉద్యోగులు నినదించారు. జీవిత బీమా వ్యాపార జాతీయీకరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం డివిజనల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. యూనియన్ అధ్యక్షురాలు ఎం. కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి జి. వరప్రసాదరావు మాట్లాడుతూ ఎల్ఐసీలో ఐపీవోను బీమా ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. భోజన విరామ సమయంలో నిర్వహించిన నిరసనలో ఉద్యోగులు పాల్గొన్నారు.

రహదారే పార్కింగ్ జోన్



ఎన్‌ఎస్‌టీఎల్ రోడ్డులో పార్క్ చేసిన బస్సులు



సుసర్ల కాలనీ 80 ఫీట్ రోడ్డులో పార్క్‌చేసిన వాహనాలు

గోపాలపట్నం: రహదారులు పార్కింగ్ జోన్లుగా మారిపోతున్నాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా రోడ్డును విస్తరించినా, వాహనాల పార్కింగ్‌తో వాహనచోదకులకు అవస్థలు తప్పడం లేదు. ఎన్ఎస్‌టీఎల్ గేటు నుంచి వంటిల్లు జంక్షన్‌కు వెళ్లే రోడ్డులో బస్సులు పార్క్ చేస్తున్నారు. అలాగే సుసర్ల కాలనీలో కార్లు, ఇతర వాహనాలను ఇష్టానుసారం నిలిపివేస్తున్నారు. వీటివల్ల రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నామని వాహనచోదకులు వాపోతున్నారు. సుసర్ల కాలనీలో చాలా మేరకు అపార్ట్‌మెంట్లే ఉన్నాయి. అందులో కార్ పార్కింగ్ సౌకర్యమున్నా, చాలామేరకు వాటిని వాడకుండా రోడ్లపైనే పెడుతున్నారని తెలిపారు. అలాగే కాలనీ లోపల ఉన్నవారు సైతం ప్రధాన రహదారిపైనే వాహనాలు పెట్టేసి వెళ్లిపోతున్నారు. కొన్ని వాహనాలు నెలల తరబడి ఇక్కడే ఉంటున్నాయని, ఇలా అయితే రాకపోకలెలా అని ప్రశ్నిస్తున్నారు.

వాహన చోదకుల అవస్థలు

80 అడుగులున్నా ..

ఎన్ఎస్టీఎల్ నుంచి వంటిల్లు జంక్షన్ వద్ద ప్రైవేటు బస్సులు, కళాశాల బస్సులు పెడుతుండడం వల్ల వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవలే ఈ రోడ్డును విస్తరించి 80అడుగుల రహదారిగా అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి విశాలంగా ఉందని, ఈ రోడ్డును పార్కింగ్‌కు వాడుకుంటున్నారు. ఉదయం, రాత్రి సమయాల్లో ఈ రోడ్డు చాలా రద్దీగా ఉంటుంది. ఏ మాత్రం ఆదమరిచినా, ప్రమాదాలు చోటు చేసుకుంటాయని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు వాహనాల ఇరుకు సందుల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. కొందరు రాత్రివేళల్లో మద్యం సేవించడం వంటివి చేస్తుండటంతో, ఈ దారి గుండా మహిళలు వెళ్లేందుకు కూడా భయపడే పరిస్థితి. ఇప్పటికైనా ట్రాఫిక్ అధికారులు స్పందించి, వాహనాలను రోడ్డుపై పార్క్ చేయకుండా, వాహనాల రాకపోకలకు మాత్రమే ఉపయోగపడేలా చూడాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

ఇంటి పైకప్పుపై విషసర్పం



సర్పాన్ని బంధించిన నాగరాజు

మల్కాపురం: కొండ ప్రాంతంలోని ఓ ఇంటి పైకప్పు పైకి విషసర్పం చేరడంతో ఆ ఇంటివారు హడలిపోయారు. వెంటనే స్నేక్ క్యాచర్‌కు సమాచారం ఇవ్వడంతో, అతికష్టంపై ఆయన సర్పాన్ని పట్టి బంధించారు. వివరాలివి.. జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీలోని ఓ రేకుల షెడ్ ఇంట్లోకి గురువారం మధ్యాహ్నం ఐదడుగుల పొడవైన నాగజెర్రి చొరబడింది. వెంటనే పాములను పట్టే నాగరాజుకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా, వచ్చిన ఆయన సర్పం కోసం ఇల్లు మొత్తం గాలించారు. ఎక్కడా కనిపించకపోవడంతో వెనుదిరిగేందుకు సిద్ధమయ్యారు. ఇంతలో ఇంటి పై కప్పు భాగంలో పాము తోక వేలాడటం చూసి, పైకప్పు ఎక్కి ఆ సర్పాన్ని చాకచక్యంగా బంధించారు. దీంతో ఆ ఇంటి వారు, చుటుపక్కల వారు ఊపిరి పీల్చుకున్నారు.

యోగి వేమనకు నివాళి



వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: సంఘ సంస్కర్త, కవి యోగి వేమన జయంతి వేడుకలు గురువారం శాంతినగర్‌లోని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఇంటి వద్ద ఘనంగా నిర్వహించారు. యోగి వేమన చిత్రపటానికి ఆయన పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ జీవిత సత్యాలను, మనిషి అనుసరణీయ మార్గాలను తన పద్యాల ద్వారా సమాజానికి వేమన తెలియజేశారని కొనియాడారు. నేటి తరానికి వేమన పద్యాలు, వాటి సారాంశాలు తెలియపరచాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో స్థానికులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీఎస్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీ అధికారులు

గోపాలపట్నం: కేంద్ర సహకార బ్యాంక్‌లో ఆదాయ పన్ను టీడీఎస్‌పై అవగాహన కల్పించారు. ఆదాయ పన్ను జాయింట్ కమిషనర్ శంకర్ పాండి, డిప్యూటీ కమిషనర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ రూ.20 లక్షలు మించి నగదు ఉపసంహరణపై 194 ఎన్ ప్రకారం టీడీఎస్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. సహకార బ్యాంకులకు సంబంధించిన ఇతర టీడీఎస్ సెక్షన్‌లను వివరించారు. సదస్సులో విశాఖ, శ్రీకాకుళం, ఆదాయ పన్ను ఇన్‌స్పెక్టర్లు పి. రమేష్, ఉమామహేశ్వరరావు, బ్యాక్ జీఎంలు డి.అన్నపూర్ణ, డి.శ్రీనివాసరావు, డీజీఎం ఎం.అశోక్ కుమార్, పి.వి.ఎస్.నాయుడు, ఏజీఎం ఎం. శ్రీనివాసరావు, జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులకు బ్రేక్‌డౌన్ లేని సర్వీసులు



సింహాచలం డిపో సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎంఈ అప్పలనాయుడు

గోపాలపట్నం: బ్రేక్‌డౌన్ లేని సర్వీసులను ప్రయాణికులకు అందించాలని డిప్యూటీ సీఎంఈ బి.అప్పలనాయుడు సూచించారు. సింహాచలం ఆర్టీసీ బస్ డిపోను గురువారం సాయంత్రం ఆయను సందర్శించారు. డిపోలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ రోడ్డుపై మరమ్మతులకు గురై బస్సులు నిలిచిపోయే పరిస్థితి రాకూడదన్నారు. జీరో బ్రేక్‌డౌన్ సర్వీసులు అందివ్వాలని కోరారు. ఇక్కడి డిపోలో ఉన్న సమస్యలు, ఇబ్బందులు సిబ్బందిని అడిగి అప్పలనాయుడు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కె.రాజశేఖర్, మెకానికల్ ఇన్‌చార్జి కొండలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ



శిక్షణ పొందిన విద్యార్థులతో బీఎస్ఎన్ఎల్ అధికారులు, ప్రిన్సిపాళ్లు

అల్లిపురం: బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో గత ఆరు నెలలుగా నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా డాబాగార్డెన్స్‌లో గల సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జనరల్ మేనేజర్ జి.ఆడమ్ మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ నైపుణ్య శిక్షణ ప్రాధాన్యతను వివరించారు. డిప్లమో విద్యార్థులకు బీఎస్ఎన్ఎల్ అన్నివిధాల సహకారం అందజేస్తుందన్నారు. డిజిటల్ ఇండియా మిషన్ కింద దేశాన్ని నిర్మించే సత్తా నేటి యువతకు ఉందన్నారు. విశాఖపట్నంలో బీఎస్ఎన్ఎల్ ట్రైనింగ్ ద్వారా అన్ని టెక్నికల్ సేవలు అందిస్తుందన్నారు. 6 నెలల శిక్షణ కాలంలో రెండు తరగతులు, నాలుగు నెలలు ఐపీ స్విచ్చింగ్ వంటి కార్యక్రమాలు, ఫీల్డ్ వర్కు జరిగిందన్నారు. కార్యక్రమంలో భీమిలి, చోడవరం, నర్సీపట్నం, అనకాపల్లి, పార్వతీపురం, కాకినాడ, నందిగామ, రేపల్లెకు చెందిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 224 మంది విద్యార్థులు శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పి.పాల్ విలియం, ఈబీ అండ్ శిక్షణ, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.సత్యప్రసాద్, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు జి.పద్మావతి, పి.అనురాధ, ఉషారాణి, అమర్నాథ్, కె.శ్రీనివాసరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు.

గైస్ విద్యార్థినికి ఉత్తమ ప్యాకేజీతో ఉపాధి



దాసరి వంశీప్రియాంక

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) విద్యార్థిని దాసరి వంశీప్రియాంక ఉత్తమ ప్యాకేజీతో ఉపాధి పొందింది. రూ.6.73 లక్షల వార్షిక వేతనంతో ఏసియన్ పెయింట్స్ కంపెనీలో ఉద్యోగం సాధించింది. ఇంతవరకు డిప్లమా విద్యార్థులకు ఇంతటి ప్యాకేజీతో ఉద్యోగం వచ్చిన దాఖలాలు లేవని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. వంశీప్రియాంక ఈ కాలేజీలో కెమికల్ ఇంజినీరింగు కోర్సులో 2018లో చేరి 2022 ఏప్రిల్‌లో పాస్‌అవుట్ అయింది. ఈమెకు అచ్యుతాపురంలోని ఏసియన్ పెయింట్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ప్రిన్సిపాల్‌తో పాటు డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, డాక్టర్ ఎం.విజయలక్ష్మి.. ప్రియాంకను అభినందించారు.

ఏయూ టీడీఆర్ హబ్ పోర్టల్ ప్రారంభం



పోర్టల్‌ను ప్రారంభిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లినరీ హబ్ పోర్టల్(టీడీఆర్)ను వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి ప్రారంభించారు. వీసీ కార్యాలయంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏయూ టీడీఆర్ డీన్ జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రవేశాలు పొందిన పరిశోధకులు, రీసెర్చ్ గైడ్‌లు శనివారంలోగా తమ వివరాలు సమగ్రంగా పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పోర్టల్ ద్వారా రీసెర్చ్ గైడ్‌తో పరిశోధకులు ఎక్కడనుంచైనా తమ పరిశోధనకు సంబంధించిన ప్రగతిని చర్చించడం, వివరించడం సాధ్యపడుతుంది. దశలవారీగా పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ సేవలు అందించే వేదికగా ఈ పోర్టల్‌ను తీర్చిదిద్దుతామన్నారు. రెక్టార్ ఆచార్య కె.సమత తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు మెడల్స్



వైద్య విద్యార్థినికి ఆచార్య పెదవీర్రాజు గోల్డ్ మెడల్ అందజేస్తున్న డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: బయోకెమిస్ట్రీ పాథాలజీ, మైక్రోబయాలజీ, రేడియాలజీ విభాగాలు కలిగి ఉన్న పరిశోధనాత్మక వైద్య విభాగాల నుంచి ఉత్తమ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ పెదవీర్రాజు బంగారు పతకం కోసం పన్నెండు మంది పీజీ విద్యార్థులు పరిశోధన వర్క్‌ను సమర్పించారు. అందులో ఐదుగురిని తుది ప్రదర్శనకు ఎంపిక చేశారు. మైక్రోబయాలజీ విభాగంలో పీజీ విద్యార్థిని డాక్టర్ మౌనిక పెద్దపల్లి 2022 సంవత్సరానికి ప్రొఫెసర్ ఈ. పెద వీర్రాజు గోల్డ్ మెడల్ పొందారు. మరొక పరిశోధనకు గాను పాథాలజీకి చెందిన డాక్టర్ ఎస్. తానారి శ్రీకి కన్సొలేషన్ బహుమతి లభించింది. అమెరికాకు చెందిన గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ నాగుల సీతారామయ్య సమక్షంలో వైద్య విద్యార్థులకు ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ మెడల్లు అందజేశారు. ఏఎంసీ రీసెర్చ్ ఫోరం ప్రొఫెసర్ డాక్టర్ సామిని, ఇన్వెస్టిగేటివ్ మెడిసిన్ విభాగాల ఫ్యాకల్టీ, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

నేపాల్‌లో మానవ హక్కులపై అభిప్రాయ సేకరణ

దాబాగార్డెన్స్: ఆసియా దేశాల్లో మానవ హక్కుల అమలు తీరుపై ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల మండలి వచ్చే నెల 13న నేపాల్ దేశం ఖాట్మాండ్‌లో అభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్టు మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993 కంటితుడుపుగా ఉందని, ఈ చట్టంపై ప్రజాప్రతినిధులకు అవగాహన లేదన్నారు. బాలల హక్కులు, మానవ హక్కులు, మహిళల హక్కులకు ఏర్పాటు చేసిన కమిషన్‌లకు అధికారాలు కల్పించాలని, రాజకీయ పునరావాస కేంద్రాల స్థాయి నుంచి విముక్తి కల్పించాలని నివేదిక రూపొందిస్తున్నట్టు తెలిపారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో నేపాల్‌లో జరిగే సదస్సులో భారత్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక దేశాలలో మానవ హక్కుల ఉల్లంఘనలు, చట్టాలు అమలు, తదితర అంశాలు చర్చించనున్నారని కౌన్సిల్ సభ్యుడు ఎం.సూర్య శ్రీనివాస్ తెలిపారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, పీపుల్స్ వాచ్, కామన్ వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇన్షియేటివ్, తదితర మానవ హక్కుల స్వచ్ఛంద సంస్థలు భారత్ నుంచి ఆహ్వానం అందుకున్నాయన్నారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు బీవీహెచ్ శ్రీరాములు, మార్టిస్ ఎర్రైనా, కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ శ్రీధర్ వార్డు పర్యటన

పార్కుల్లో అభివృద్ధి పనుల పరిశీలన



పార్కులో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న డిప్యుటీ మేయర్ శ్రీధర్

గోపాలపట్నం: డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం 52వ వార్డులో పర్యటించారు. ప్రధానంగా పార్కుల అభివృద్ధి పనులపై దృష్టి సారించారు. ఇక్కడి శాంతినగర్, గౌరీనగర్, కరాసా పార్కుల్లో ఆధునికీకరణ పనులను పరిశీలించారు. పార్కుల్లో మౌలిక సదుపాయాలను కల్పించే విషయమై అధికారులతో మాట్లాడారు. కరాసా ప్రాథమిక పాఠశాలను నాడు-నేడు పథకం ద్వారా అభివృద్ధి చేయాలని అధికారులను కోరారు. వార్డులో అన్ని ప్రాంతాల్లో రహదారులు, కాల్వల అభివృద్ధి, వీధి దీపాల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ పనులు త్వరితగతిన ప్రారంభించాలని, ప్రారంభమైన పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీహెచ్ దామోదర్, డీఈ ఏడుకొండలు, ఏఈ ఉష, వాటర్ వర్క్స్ ఏఈ గణేష్, సచివాలయం కార్యదర్శులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన



పాతగోపాలపట్నం సచివాలయంలో స్థానికులతో మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: పాత గోపాలపట్నం 481 సచివాలయాన్ని గురువారం జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు సందర్శించారు. సచివాలయ సిబ్బంది పనితీరును పరిశీలించారు. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందే తీరు, పింఛన్లు మంజూరు కాకుండా ఉన్న వారి వివరాలను స్థానికులను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఏ పథకాలైనా అర్హత ఉండి రాకుండా ఉంటే తమకు సమాచారమివ్వాలని సచివాలయ కార్యదర్శులకు సూచించారు. వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. పార్టీ వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి, పి.ఎస్.రాజు, బల్లంకి వెకటరావు, గాంధీ, ఉష, కుమారి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ-రాయగడ సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు



అధికారులతో అభివృద్ధి పనులపై చర్చిస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం - రాయగడ సెక్షన్ పరిధిలో గురువారం డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి విండో ట్రయలింగ్ తనిఖీలు నిర్వహించారు. ఆయా రైల్వే స్టేషన్లలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, స్టాక్‌ను పరిశీలించారు. ఈ సెక్షన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన సమీక్షించారు. రాయగడ స్టేషన్‌లో అధికారులు, సిబ్బందితో డీఆర్ఎం మాట్లాడారు. ప్రయాణికులతో మాట్లాడి, వారి సమస్యలను, సూచనలను స్వీకరించినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. తనిఖీల్లో సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్(జి) మనబేష్ మిశ్రా, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సిహెచ్.రఘువీర్, రైల్ వికాస్ నిగం లిమిటెడ్ ఏజీఎం శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పునశ్చరణ తరగతులతో సమర్థంగా విధులు



సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్

దొండపర్తి: ఆధునిక సమాజంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించేందుకు పునశ్చరణ తరగతులు దోహదపడతాయని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఏఆర్ సిబ్బందికి మొబిలైజేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మొదటి విడతగా ఏఆర్ సిబ్బందికి 15 రోజుల పాటు పీటీ, డ్రిల్, యోగా, ఆయుధ తరగతులతో పాటు వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. విధి నిర్వహణలో నైపుణ్యం పెంపొందించుకునేందుకు ఈ శిక్షణ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 సునీల్ సుమిత్ గరుడ్, డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, డీసీపీ (క్రైం) జి.నాగన్న, ఎస్బీ ఏడీసీపీ డి.గంగాధర్, ఏఆర్ ఏడీసీపీ కె.సుబ్రహ్మణ్యం, ఏసీపీలు (ఏఆర్) ఆర్‌పీఎల్ శాంతికుమార్, జి.రాఘవేంద్రరావు, ఆర్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పరమేశ్వరుడికి అభిషేకం

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో స్వామికి గురువారం సాయంత్రం త్రయోదశి ప్రదోషకాల అభిషేకాన్ని విశేషంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పాత టైర్ల దుకాణంలో అగ్ని ప్రమాదం

భారీగా ఎగసిపడ్డ మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గాజువాక : స్థానిక శ్రీనగర్‌లోని సివిల్ సప్‌లెస్ గోడన్ల సమీపంలో గల ఒక పాతటైర్ల దుకాణంలో గురువారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వంట కోసం కర్రల పొయ్యి వెలిగించడానికి పెట్రోల్ పోయడంతో ఈ సంఘటన చోటుచేసుకున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. సతేందర్ కుమార్ యాదవ్ అనే వ్యక్తి శ్రీనగర్‌లోని సివిల్ సప్లై గోడన్ల వద్ద పెట్రోల్ బంక్‌ను ఆనుకొని పాతటైర్ల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇద్దరు సిబ్బందిని నియమించుకొని పాత టైర్లకు పంక్చర్లు వేయడంతోపాటు రీటరింగ్ పనులను నిర్వహిస్తున్నాడు. అందులోనే వంట చేసుకోవడం కోసం గురువారం కట్టెల పొయ్యి వెలిగించారు. అది మండటం కోసం అందులో పెట్రోల్ పోయడంతో ఒక్కసారిగా మంట పైకి వచ్చి అక్కడి పాతటైరుకు అంటుకుంది. ఆ మంట క్షణాల్లో మొత్తం దుకాణమంతా విస్తరించింది. దీంతో దట్టమైన పొగతో కూడిన మంటలు ఎగసిపడ్డాయి. పొగలు ఆ ప్రాంతాన్ని కమ్మేశాయి. సంఘటన చోటుచేసుకున్న దుకాణానికి ఆనుకొని పెట్రోల్ బంక్ కూడా ఉండటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పెదగంట్యాడ అగ్నిమాపక సిబ్బంది రెండు శకటాలతో అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. గాజువాక సీఐ ఎల్. భాస్కరరావు సంఘటన స్థలాన్ని సందర్శించి ప్రాథమిక విచారణ నిర్వహించారు.